క్లుప్తంగా

రైతు నేస్తం పురస్కారానికి శేషుకుమార్ ఎంపిక


శేషుకుమార్

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు వాసి కర్ల శేషుకుమార్ రైతు నేస్తం పురస్కారానికి ఎంపికైె నట్లు శేషుకుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. తెలుగు రాష్ట్రాల స్థాయి ఉత్తమ రైతు పురస్కారాన్ని ఈ నెల 14న ఎన్‌టీఆర్ జిల్లా గన్నవరంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకటయ్యనాయుడు చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల మండలానికి చెందిన పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

నడిగూడెం : దసరా పండుగను పురస్కరించుకుని నడిగూడెంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 22 వరకు రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పందిటి క్రాంతికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,016లు, ద్వితీయ రూ.25,016లు, తృతీయ రూ.20,016లు, చతర్థ బహుమతి రూ.10,016లు నగదుతో పాటు, షీల్డులను అందజేయనున్నట్లు ఆ యన తెలిపారు.ఆసక్తి గల క్రీడాకారులు 9182115126 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మునగాలలో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

మునగాల : దసరా పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంవైసీసీ ఆధ్వర్యంలో శనివారం నుంచి ఈనెల 19వరకు కోదాడ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు వరుసగా రూ.10,016, 7,016, 4,016, 2,016ల నగదు అందచేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 95051 62661, 96667 24780 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా మాసకల్యాణం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను పూలు, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామివారికి పుణ్యావచనం, పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తదనంతరం స్వామివారికి విశేష అలంకరణ తదితర కార్యక్రమాలతో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కొండా రెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ భక్తులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు.. ఇద్దరి రిమాండ్


పట్టుబడ్డ నిందితుడితో అధికారులు

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలంలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి 1600 బెల్లం పానకం ధ్వంసం చేసి, 30 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గరిడేపల్లి మండలం మంగాపురంతండా, కపూర్యాతండా, లాచ్యాతండా, కీతవారిగూడెంలలో ఎక్సైజ్, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారు చేస్తున్న వాంకుడోతు గోప, ధరావత్ విజయల వద్ద నుంచి 30 లీటర్ల సారా, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, 1600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. వారిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వెంకటరెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐలు జగన్, వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి


వాల్ రైటింగ్‌ను చెరిపివేయిస్తున్న అధికారులు

మఠంపల్లి : మండలంలో ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీఓ జానకిరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని పెదవీడు, రామచంద్రాపురంతండా తదితర గ్రామ పంచాయతీల్లో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) బృందంతో కలిసి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వాల్ రైటింగ్‌లు చెరిపివేత, విగ్రహాలు కనబడకుండా కప్పివేసే పనులకు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సైదులు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యే క్యాంపు కార్యాయంలో ఎస్‌డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వైఎస్సార్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు యశోధ, మండల పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, వెంకటమ్మ, నాయకులు సత్య, కవిత, అశోక్, మహేష్, తదితరులు ఉన్నారు. అంతకుముందు మేళ్లచెరువుకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వరి, మిర్చి పంటలకు నీరందించాలి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడు పరిధిలో పత్తి, మిర్చి పంటలను ఎమ్మెల్యే సైదిరెడ్డి రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జువారి సిమెంట్ చిన్న క్వారీ, నూల మల్లయ్య కుంటలను పరిశీలించి ఆ నీళ్లను పొలాలకు తరలించేందుకు జువారి సిమెంట్ పరిశ్రమ అధికారులతో మాట్లాడారు. దీంతో వారు సానుకూలంగా స్పందించి రెండు మూడు రోజుల్లో నీరు ఇచ్చేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ దొండపాడు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్ : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి


దొండపాడులో పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, తదితరులు

ఎమ్మెల్యే సైదిరెడ్డిని కలిసిన ఆగ్రో చైర్మన్ విజయసింహారెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తిప్పన విజయసింహారెడ్డి శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విషయాలు, కార్యక్రమాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి, నాయకులు కె.వెంకటరెడ్డి ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన సీనియర్ గ్రామీణ వైద్యుడు దున్నా వీరబాబు తల్లి గురవమ్మ (85) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. దీంతో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


గురవమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మోతె : తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండేది ఒక్క కాంగ్రెస్ పార్టీనే అని కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలో పలు గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, మండల నాయకులు ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, సామ చిన వెంకటరెడ్డి, గోపతండా సర్పంచ్ కొర్ర తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నర్సింహపురంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

ఆహార భద్రతకు స్వామినాథన్ కృషి


స్వామినాథన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : దేశ ప్రజల ఆహార భద్రత కోసం పరితపించిన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కవంతుల కోటేశ్వరరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బుర్రి శ్రీరాములు అన్నారు. శుక్రవారం రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ ప్రజల ఆకలి తీర్చడానికి పంటల ఉత్పత్తి పెంచడం, అధిక దిగుబడులను సాధించటం ఒక్కటే మార్గమని భావించిన మహనీయుడు డాక్టర్ స్వామినాథన్ అని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం నాయకుడు వెంకట్ రెడ్డి, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు జక్కుల మల్లయ్య, నాయకులు మేకల నాగేశ్వరరావు, యల్లావుల రాములు, విద్యాసాగర్, భిక్షం, దుగ్గి బ్రహ్మం, కాకి అజయ్, బంటు సైదులు, పాలకూరి బాబు, మురళి, చంద్రం, రామరాజు, వాసుదేవరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలి


కేఎల్ఎన్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న గీత కార్మికులు

మేళ్లచెరువు : గీత కార్మికులు అన్ని రంగాల్లో రాణించాలని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెల్లటూరులో నిర్వహించిన గీత కార్మికుల సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గీత కార్మికులు వృత్తిపైనే కాకుండా విద్య, సాంకేతిక రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం 95 మంది గీత కార్మికులకు లైసెన్సులు అందజేశారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగరాజు, శ్రీను, బ్రహ్మం, దాసు, వీరాంజనేయులు, సైదులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ఆదాయాన్ని ధర్మ రక్షణకు వినియోగించాలి

కోదాడరూరల్ : ఆలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని హిందూ ధర్మ రక్షణకు, హిందూవుల సంక్షేమానికి వినియోగించాలని బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట బాల ఉగ్రనరసింహస్వామి ఆలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఆలయాన్ని ప్రభుత్వం ఎండోమెంట్ పరిధిలోని తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం సరికాదని అన్నారు. ఎండోమెంట్ పరిధిలో ఉన్న ఆలయాల్లో స్వామివారు దూపదీప నైవేద్యాలకు నోచుకోవడం లేదని ముందు వాటి సంగతి చూసుకోవాలన్నారు. హిందూ ఆలయాల ద్వారా వస్తున్న ఆదాయంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ముందుగా ప్రధాన అర్చకులు ఇనుకుతికెల లక్ష్మీనర్సింహమూర్తి ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక ట్రస్ట్ సభ్యులు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు చీకోటి ప్రవీణ్

స్వతంత్ర అభ్యర్థిగా రామకృష్ణ యాదవ్


రామకృష్ణయాదవ్ అభ్యర్థిత్వాన్ని ఆమోదిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మునగాల : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గణపవరం గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ బరిలోకి దిగబోతున్నాడు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన బీసీ విద్యార్థి, నిరుద్యోగ, యువత ఆత్మీయ సమ్మేళనంలో నియోజకవర్గ పరిధిలో ఆరు మండలాల బీసీ విద్యార్థి సంఘం నాయకులు, నిరుద్యోగులు ప్రతిపాదించినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్ గౌడ్ తెలిపారు. అనంతరం యాదవ్ రాజ్యాధికార సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బడుగుల నాగార్జున మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణయాదవ్‌కు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పచ్చిపాల రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ త్వరలో గడపగడపకు తిరిగి బలహీన వర్గాల వారికి ప్రతినిధిగా ఉంటానని, ప్రతి సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి భాష్యం వంశీయాదవ్, బీసీ సేన రాష్ట్ర కార్యదర్శి మాగంటి వీరేందర్, బీసీ యువజన సంఘం మునగాల, చిలుకూరు మండలాల అధ్యక్షులు బత్తుల కిరణ్, నరేష్ చారి, విద్యార్థి సంఘం నాయకులు అలవాల నరేష్‌గౌడ్, దొంతగాని నాగేశ్వరరావు, సురగాని పరుశరామ్, నవీన్, సతీష్, లక్ష్మీనారాయణ, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.

వైఆర్‌ఎస్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా శివశంకర్


నియామకపత్రం అందజేస్తున్న వైఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు నాగార్జున

హుజూర్‌నగర్ : బహుజన రాజ్యాధికారంలో యాదవులు ముందు వరుసలో ఉండాలని యాదవ రాజ్యాధికార సాధన సమితి (వైఆర్‌ఎస్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వైఆర్‌ఎస్ఎస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా యాతవాకిళ్లకు చెందిన యల్లావుల శివశంకర్ యాదవ్‌ను, ప్రధాన కార్యదర్శిగా పానుగోడుకు చెందిన మన్నెం వేణుయాదవ్‌లను నియమిస్తూ నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సమితి గౌరవ సలహాదారుడు గద్దం నారాయణ, ముఖ్య నాయకులు జక్కుల నరేందర్, పగిడి వీర నాగరాజు, జంగిలి నవీన్, మన్నెం నవీన్, కోడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల బరిలో పిల్లుట్ల రఘు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లకు చెందిన ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేయనున్నట్లు ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని మఠంపల్లిలో నిర్వహించిన ఓజో ఫౌండేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రామాంజిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఓజో ఇన్‌చార్జ్ వెంకన్న

కోదాడలో అవినీతిని అంతమొందించాలి

కోదాడ : నియోజకవర్గంలో అవినీతిని అంతమొందించి అధికార, ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని, అసెంబ్లీ ఎన్నికల్లో యువత నీతిమంతులను గెలిపించాలని బీసీ యువజన సంఘం నాయకుడు డాక్టర్ అంజియాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన యువజన సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా 16 వేల మంది డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువత ఉందని, వారందరికీ ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను కోదాడ నుంచి పోటీ చేస్తానని, తనను ఆశీర్వదిస్తే యువతకు ఉపాధి కల్పించడంతో పాటు అవినీతి రహిత పాలననందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్‌నాయుడు, దేశినేని, గంధం సైదులు, ఠాకూర్ సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అంజియాదవ్

ప్రయాణికుడి వెండి చోరీ

కోదాడరూరల్ : బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి వెండి చోరీకి గురైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడకు చెందిన రంగినేని ఉపేందర్‌రావు గురువారం రాత్రి ఖమ్మం వెళ్లి మూడు కిలోల వెండి తీసుకొని ఆర్టీసీ బస్సులో ఇంటికి వెళ్తున్నాడు. కోదాడ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత పక్కన ఉన్న బ్యాగులో చూడగా వెండి కనిపించకపోవడంతో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

భూదాన భూములను కాపాడాలని ఆర్డీఓకు వినతి

హుజూర్‌నగర్ : భూదాన భూముల మార్పులు, చేర్పులపై నిఘా ఉంచాలని న్యాయవాది కమతం నాగార్జున కోరారు. ఈమేరకు శుక్రవారం హుజూర్‌నగర్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జగ్దీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేళ్లచెరువు, మఠంపల్లి మండలాల్లో వందల ఎకరాల భూదాన్, సీలింగ్, ప్రభుత్వ, అసైన్డ్, ఫారెస్ట్, డీఫారెస్ట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి పట్టా భూములుగా ధరణిలో నమోదు చేయించుకునేందుకు సిమెంట్ పరిశ్రమలకు చెందిన కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పూర్తయ్యే వరకు ధరణిలో భూదాన భూముల మార్పులు, చేర్పులకు ఆస్కారం లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ స్పందిస్తూ భూదాన్ భూములను పట్టా భూములుగా మార్పు చేయడం అసాధ్యమని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీ బూత్ కమిటీలు చురుగ్గా పనిచేయాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు కృష్ణయ్య

కోదాడ : రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకమని, బూత్ కమిటీలు చురుగ్గా పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య కోరారు. శుక్రవారం పట్టణ బీజేపీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివారం కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కోదాడకు వస్తున్నందున శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాతులూరి హనుమంతరావు, రవికుమార్, పురుషోత్తం, వెంకటేష్, నగేష్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలే మా బలగం

మోతె : రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలే మా బలం, మా బలగం అని పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బూత్ లెవల్ కమిటీ, వార్డు కమిటీల నియామకాలు చేపట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఆరె లింగారెడ్డి, సర్పంచ్ గుండాల గంగులు, ఎంపీటీసీమద్ది మధుసుదన్ రెడ్డి, కారింగుల సత్యనారాయణ, కారింగుల శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్ మేజర్ కాలువకు నీటి పరిమాణాన్ని పెంచాలి


చెరువుతండా వద్ద ఎండుతున్న పంటను చూపుతున్న రైతులు

పాలకవీడు : మండలంలోని సాగర్ ఆయకట్టు పరిధిలోని జాన్‌పహాడ్ మేజర్ కాలువ చివరి భూములకు సాగు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్–15 మైనర్ కాల్వ కింద ఎండుతున్న తమ పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు. సాగర్ ఎడమ కాలువకు సాగునీటిని విడుదల చేసి వారం రోజులు గడుస్తున్నా చివరి భూములకు నీరందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల ఎన్ని రోజులు కొనసాగుతుందో అధికారులు సైతం స్పష్టత ఇవ్వడం లేదని ఏ క్షణాన నీటి విడుదలను నిపివేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నెస్పీ అధికారులు కనీసం పర్యవేక్షణ చేయడం లేదని అన్ని మైనర్ కాల్వలకు నిర్దిష్ట పరిమాణంలో నీటిని నడిపించి పంటలను కాపాడాలని వ్యవసాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

కోదాడరూరల్ : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కోదాడ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఆ పార్టీ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండలంలోని పలు సెంటర్ల ఆటో యూనియన్ సభ్యులను కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగరాజు, శేఖర్, రాము, కోటయ్య, పాషా, మధు, రవి, మైసయ్య, రామకృష్ణ, వెంకన్న, శ్రీరామ్, మూర్తి, రహీం తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఏడుకొండలు

నడిగూడెం : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని నడిగూడెం ఎస్ఐ ఏడుకొండలు అన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో శుక్రవారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ప్రత్యేక తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ యం.యర్రయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల బెడదను నివారించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని కరక్కాయలగూడెంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నారులను, గేదెలను గాయపరుస్తున్నాయని, వీధి కుక్కలను నివారించాలని పాడి రైతు కీత అప్పారావు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో గేదెదూడను కుక్కలు గాయపరచడంతో చికిత్స చేయించినట్లు తెలిపారు. వాహదారులను సైతం వెంబడించి భయాందోళనకు గురిచేస్తున్నాయని చెప్పారు. రాత్రిపూట కుక్కలు గుంపులుగా తిరుగుతూ మొరుగుతుండటంతో నిద్రపట్టడం లేదని, వీధుల్లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నామని చెప్పారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టి కుక్కలను నివారించాలని కోరారు.

మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి

చిలుకూరు : హైదరాబాద్‌లో నవంబర్ 7వ తేదీన నిర్వహించబోయే మాదిగల విశ్వరూప మహాసభలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ కోరారు. శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలో మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్‌నపాయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధించేంతవరకు ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మల్లెపంగు సూరిబాబు, మండల నాయకులు షేక్ మౌలానా, కందుకూరి అఖిల్, వడ్డేపల్లి సిద్దు, నూకపంగు వినయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నడిగూడెం : ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్.మాడుపల్లి రవికుమార్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని నారాయణపురంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా 62 పశువులకు ఉచితంగా చికిత్స చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భాస్కర్, సూపర్‌వైజర్‌లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వాన్ని మార్చాలి

నేరేడుచర్ల : ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రజలు ప్రభుత్వాలను మార్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజనాయుడు అన్నారు. శుక్రవారం బోడలదిన్నలో నిర్వహించిన సీపీఐ గ్రామ శాఖ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, జిలకరాజు శ్రీను, నాగరాజు తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని బీఆర్‌టీయూ నియోజకవర్గ నాయకుడు పి.ఉపేందర్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో బజార్ హమాలీ, ఫ్రూట్, లారీ మెకానిక్ యూనియన్ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : సాగర్ ఎడమ కాలువ నీటి విడుదలకు అహర్నిశలు కృషి చేసి ఎండిపోతున్న పంటలకు కాపాడిన ఎమ్మెల్యే సైదిరెడ్డి రైతు బాంధవుడని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు మాశెట్టి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, నల్లపాటి భాస్కర్, బాణోతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు టికెట్లు ఇవ్వని పార్టీలకు ఓటెయ్యొద్దు

గరిడేపల్లి : తెలంగాణలో త్వర్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు 50 శాతం ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వని పార్టీలకు బీసీలు ఓట్లు వేయవద్దని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి శేఖర్, భట్టిపల్లి హుస్సేన్, మేక దుర్గాప్రసాద్, తెలబటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షం మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

మోతె : పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రెబ్బ భిక్షం మృతి కాంగ్రెస్‌కు తీరని లోటని మాజీ సర్పంచ్ కుందూర్ వీరభద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో రెబ్బ భిక్షం మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెన్నారెడ్డి, నాగిరెడ్డి హనుమారెడ్డి, రామసాని కృష్ణారెడ్డి, వెన్న సత్తిరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు లింగయ్య పాల్గొన్నారు.

రేపు బీసీ సంఘం రాష్ట్ర మహాసభ

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని కాచిగూడలో గల మున్నూరు కాపు సంఘం భవనంలో ఈనెల 15 న నిర్వహించబోయే బీసీ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చింతల శ్రీకాంత్ కోరారు. శుక్రవారం ఆయన నేరేడుచర్లలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో రాజ్యాధికారం కోసం బీసీలు ఐ క్యతతో కలిసి రావాలన్నారు. రాజకీయ పార్టీలు బీసీలకు 56 శాతం అసెంబ్లీ సీట్లు కేటాయించాలన్నారు.

21న బహుజన బతుకమ్మ వేడుకలు

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న బహుజన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు కూలి పోరాట సమితి రాష్ట్ర నాయకుడు పలస యాదగిరి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వారు వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బత్తుల గుర్వయ్య, మిరియాల లింగయ్య, పెద్ది నర్సయ్య, పి.నాగయ్య, విజయ్ పాల్గొన్నారు.

పాఠశాలలో బతుకమ్మ సంబరాలు


బతుకమ్మలతో ఉపాధ్యాయులు

మునగాల : మండల కేంద్రంలోని ట్రినిటీ స్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలను తయారు చేసి ఆడిపాడారు.